

# బ్రతుకు బొంగరం

డాక్టర్ సమ్మనూరు రమేష్ బాబు

"**తా**తయ్యా! చూడు! నేనెలా బొంగరం తిప్పుతానో!" అని ముద్దుగా పలుకుతున్న మనుమడు సాయికృష్ణను మురిపెంగా చూశాన్నేను.

"చూడు ఈ బొంగరం ఎలా వుందో?" అని ఒక్కసారిగా వాడి చేతిలోని బొంగరాన్ని నా చేతిలో పెట్టాడు. అనుకోకుండానే నేను బొంగరాన్ని చూశాను. ఒక్కసారిగా గతం గబుక్కుమని నన్ను కుదిపేసిందేమో బైర్లు కమ్మిన కళ్ళకు, తడి యింకా ఆరని గుండెకు లీలగా మెరిసిన జ్ఞాపకాలలో చిన్ననాటి ఆనవాళ్ళు ఓనమాలు దిద్దడం ప్రారంభించాయి.

"చాలా బాగుంది. ఏది తిప్పు చూద్దాం" అన్నాను. అది కూడా చాలా చాలా యాంత్రికంగా అన్నాను. తిరుగుతున్న బొంగరాన్ని చూస్తుంటే తిరిగిరాని కాలం గుర్తుకు వస్తోంది. మనస్సు అయిదారు దశాబ్దాల వెనక్కి పరిగెత్తింది. మా ఊరిలో అంటే కడపజిల్లా రాజంపేటలో చక్రాలమడుగు దగ్గర, పోలి చెరువు గట్టు దగ్గర, ఆసుపత్రి ఎదురుగా వున్న మసీదు దగ్గర, అమ్మవారి శాల దగ్గర, ఆంజనేయస్వామి గుడి ముంగిట, శివాలయంలో హైస్కూలు దగ్గరా మన్నూరుకు పోయే దారిలో ఉన్న ఘోరీల దగ్గర నా మనసు తిరగడం ప్రారంభించింది.

"గోరీ అనాలా? ఘోరీ అనాలా?" అని మా తాతను అడిగితే ఘోరంగా ఉంటుంది కాబట్టి ఘోరీ అనడమే సబబని ఆయన అన్న మ్మాటలు గుర్తుకు వస్తున్నాయి. అయినా ఘోరీ అనేది మన తెలుగు పదం కాదు అనేవాడు. ఆ ఘోరీల దగ్గర రాత్రి పన్నెండుగంటలపుడు ఒక బూమ్మ కూర్చుని ఉంటుందని వచ్చేపోయేవారిని సున్నం అడుగుతూ ఉంటుందని సాయిగాడు చెప్పేవాడు. ఆ మాట నిజమేనని సత్యంగాడు కూడా అనేవాడు. ఈ దెబ్బతో మధ్యాహ్నం పూట కూడా ఆ దారిలో వెళ్ళడానికి భయపడేవాడిని నేను.

దీనికి తోడు మా ప్రక్కింటి కంఠీరవాచార్యులు మరింత భయపెట్టేవాడు. దెయ్యాలు, భూతాలు రకరకాలుగా ఉంటాయి.

అసురసంధ్య వేళ కొన్ని పిశాచాలు తిరుగాడుతాయి. మిట్టమధ్యాహ్నం, అర్ధరాత్రి ఒంటరిగా వున్నప్పుడు ఈ ప్రేతాలు మనిషిని పట్టి పీడుస్తాయి. ఇవి ఎలా అయినా కనిపించవచ్చు. కొరివిలాగా, అమ్మాయిలాగా, కుక్కలాగా, పసిబిడ్డలాగా ఎలా అయినా కనిపిస్తాయి. ఒక్కోసారి ఏమీ కనిపించకుండానే ఏడుపులు, నవ్వులు, గాజుల చప్పుడు, గజ్జెలమోత వినిపించవచ్చు. భయపడకూడదు. భయపడితే మాత్రం మనం, దెయ్యం బారిన తప్పక పడతాము.

ఈ మాటలు వింటుంటే ఎవరికి భయం వెయ్యకుండా వుంటుంది?

కర్నూలు జిల్లాలో బైలుప్పల అనే పల్లెటూర్లో మా మేనత్త ఉండేది. వాళ్ళింట్లో మేడ మీద ఒక గదిలో రాత్రి పూట కుక్క తిరుగుతూ ఉంటుంది. మా అమ్మ అది నిజం కుక్క అనుకుందట. కాని అది రెండేళ్ళక్రితం చనిపోయిన కుక్కట. అది దెయ్యమై యింకా తిరుగుతూనే వుంది.

మా తాతగారు ఓ సాయం సంధ్య వేళ ఒంటరిగా కూర్చుని గంధం తీస్తుంటే ఉన్నఫళంగా పసిపాప కనిపించిందట. ఉగ్ర నరసింహుని మంత్రం చదివి మా తాత బైట పడ్డాడుట. దెయ్యం వచ్చి ఈ రోజు మా యింటి తలుపు తట్టిందని రత్నాలు అంటే మూడో క్లాసులోని నా మిత్రురాలు చెబుతుంటే కళ్ళు పెద్దవి చేసి వినేవాడిని.

"మా అప్పారాజు పేటలో ఒక ఫకీరు ఉన్నాడు. దెయ్యాన్ని వదిలించి వెంట్రుకలో కూర్చోబెట్టి స్మశానానికి వెళ్ళి పూడ్చిపెట్టి వస్తాడు తెలుసా? ఎవరన్నా తెలియకుండా ఆ వెంట్రుకను మళ్ళీ బైటికి తీస్తే ఆ దెయ్యం ఆ తీసినవాణ్ని చంపేస్తుంది. అందుకే అక్కడ దెయ్యం ఉందని తెలియడానికి చీలలు కొడతారు" అని షఫీ చెబుతుంటే కొయ్యబారిపోయేవాడిని.

ఈ దెయ్యం కథలన్నీ నాతో ఎప్పుడూ తిరిగే హయాత్‌బాషాకు చెప్పేవాడిని. వాడు నోరెళ్ళబెట్టి వింటూ వుండేవాడు.

"ఏంరా మీరు! ఎప్పుడూ కలిసే తిరుగుతారు. ఒకళ్ళనొదిలి ఒకళ్ళు ఉండలేరా?" అనేవాడు గోపాలరావు మాస్టారు.

"ఏంరా! అపూర్వ సహోదరులెక్కడ?" అనేవాడు మారయ్యసారు.

"ఇదో బాలూ! నీకు చదువొస్తే చాలా?నీ ఫ్రెండ్ హయాత్‌గాడి సంగతేంటి? వాడికి కాస్త చదువు చెప్పరా! పాసయ్యేలా చూడరా!" అని చంగలయ్య సారు అనేవాడు.

"నాయనా బాలక్రిష్ణా! మా బేటాకు కూడా జరా మార్కులు వచ్చేట్లు చూడు నాయనా. అల్లా నీకు మేలు చేస్తాడు" అని బతిమాలేవాడు హయాత్ బాషా వాళ్ళ నాన్న నూర్‌బాషా!

> ## రాజకీయుడు
>
> ఎన్నికల సీజన్‌లో
> పట్టుకుంటే
> వదలని
> బంక...!
> తీరానిలిచి గెలిచేకా
> మనం
> ఎంత పట్టుకుందామన్నా
> దొరకని
> జింక...!!
>
> **- భమిడిపాటి వెంకటేశ్వరరావు**

"బాపనోడికి, తురకోడికి బాగా జతకుదిరిందిరా" అని కొందరు ఎకసెక్కమాడేవారు కాని మాకు అవేమీ పట్టేది కాదు.

నేను స్కూలుకు లంచ్‌కోసం తీసుకుపోయే పులిహోరను వాడు తినేవాడు. వాడు తెచ్చే బేకరీ వస్తువులు నాకు యిచ్చేవాడు. ఒకసారి వాడు తెచ్చిన కేకు తిన్నాను. ఎంతో బాగుంది. ఆ రుచి తలుచుకుంటే యిప్పటికీ నోట్లో నీరూరుతుంది. ఆ మాటే అవ్వతో అంటే "వెధవా! వాళ్ళు దాంట్లో కోడిగుడ్డు సొన వేస్తార్రా. తిని చావకు" అని తిట్టేది.

నిజమా! ఆ మాటే హయాత్‌ను అడిగితే "నిజమేరా" అనేవాడు.

"ప్రాణమున్న వాటిని చంపి కూరలు వండుకుని తినడం తప్పు కదా" అని నేనంటే "నిజమేననుకో! మరి తినేవాళ్ళను ఏం చేస్తాం? పైగా అందరూ ఆకు కూరలు, కాయగూరలే తినాలంటే సరిపోవంట కదా! మా దాదా చెప్పాడు" అనేవాడు.

మా పక్కింట్లో పాస్టర్ ఉండేవాడు. చేపలు, గుడ్లు, మాంసం తినడం తప్పేమీ కాదనేవాడు. దేవుడి సృష్టిలోనే ఈ తతంగమంతా ఉందనేవాడు. జింక పచ్చి గడ్డి తింటుంది. పులి గడ్డి తిని బతకలేదు. అది బతకాలంటే జింకను చంపాల్సిందే. జింక దొరకకపోతే మనిషినైనా సరే అది చంపేస్తుంది. మనిషి కూడా అంతే. నరమాంసాన్ని కూడా తినేవారున్నారని చదవలేదా నీవు అని అనేవాడు.

దేనికది అంతా న్యాయంగానే అనిపించేది నాకు. దేన్నీ కూడా వ్యతిరేకించలేదు. అలాగే సమర్ధించనూ లేదు. తర్కం కోసం చూసేవాడిని. న్యాయమా? కాదా? అని మాత్రమే ఆలోచించేవాడిని.

ఆ వయస్సుకు ఆ ధోరణే ఎక్కువే కావచ్చు.

"ఎప్పుడూ ఆ తురకోడితో ఏమి పనిరా వెధవా! పో! వాడితో పాటే మసీదుకు పోయి నమాజు చేసుకో పోరా" అని అప్పుడప్పుడూ రాఘన్న మామ తిట్టేవాడు. కాని ఆ తిట్లను నేనెప్పుడూ పట్టించుకునేవాడిని కాను. గోళీలు ఆడడంలో, బొంగరాలు తిప్పడంలో నన్ను మించిన వాడు ఎవ్వడూ ఆ చుట్టు ప్రక్కల ఉండేవాడు కాదు.

ఖాదర్‌వలి సార్ అనే మాటలు నాకు యింకా గుర్తున్నాయి.

"ఆ వెధవని కొడదామంటే చేతులాడ్రావు. చదువులో ఫస్ట్. అలాంటి వాడిని కొట్టాలంటే నా వల్ల కాదు."

ఈ మాటలు తలుచుకున్నప్పుడల్లా గర్వంగా ఫీలయ్యేవాడిని.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. గోళీలు ఆడడంకన్నా బొంగరాలు ఆడడమంటేనే నాకిష్టం.

బొంగరాలు ఆడే చంద్రుడికథ అన్నా యింకా ఇష్టం. నాకు బాలక్రిష్ణ అని కాకుండా బాలచంద్ర అని పేరు పెట్టి వుంటే బాగుండేది కదా అని మా అమ్మను అడిగేవాడిని. చివరికి నా పేరు రమేష్‌బాబు అయిపోయింది. అది వేరేసంగతి. ఓడిపోయిన వాడి బొంగరాన్ని బర్దీ గీచి మధ్యలో పెట్టేవారు. ఇక అందరూ ఆ బొంగరాన్ని కొట్టేవారు. నేను ఎందరి బొంగరాలు పగులగొట్టాను. రాంగోపాల్‌గాడి బొంగరం పగులగొట్టానన్న కోపంతో వాడి చెల్లెలు లక్ష్మి విసిరిన రాయి తగిలి నా పన్ను విరిగిపోయింది కూడా. అప్పట్లో పన్ను విరిగిందన్న బాధ ఉండేది. ఇప్పుడు ఆ విరిగిన పన్నే తియ్యటి జ్ఞాపకమై ఊరిస్తోంది.

ఇలాగే ఓసారి- అది రంజాన్‌కు ముందు రోజనుకుంటాను. హయాత్‌గాడి బొంగరం కూడా విరిగిపోయింది. రెండు ముక్కలైంది. వాడికి బాగా ఉక్రోషం వచ్చినట్లుంది. జేబులోంచి చివాలున మరో బంగారు బొంగరం తీశాడు.

"దీన్ని పగులగొట్టరా చూద్దాం! దీన్ని మా మున్నా సౌదీ నుంచి తెచ్చాడు తెలుసా?" అన్నాడు.

దాన్ని చూడగానే నాకెంతో ముచ్చట వేసింది.

"ఉరేయ్! దాన్ని నాకివ్వరా! ఇదిగో మొత్తం ఈ బొంగరాలు...ఎనిమిదీ నీకే యిచ్చేస్తాను" అన్నాను బ్రతిమలాడుతూ.

వాడు ఒక్కసారిగా కళ్ళు పెద్దవి చేశాడు.

"నిజంగానా?" అంటూ ఆశ్చర్యపోయాడు.

"అవును! ఒట్టు! మన స్నేహం మీద ఒట్టు" అన్నాను.

వాడి సంబరానికి అంతే లేదు. ఎంతో సంతోషంగా ఆ బంగారు బొంగరాన్ని నాకిచ్చేశాడు. నేను కూడా ఆ బంగారు బొంగరాన్ని ఎంతో లాలనగా తీసుకుంటూ అన్ని బొంగరాలూ వాడికే ఇచ్చాను. పైగా ఇరవై గోళీలు కూడా యిచ్చాను.

"నీవెంత మంచివాడివిరా?" అంటూ వాడు నన్ను హత్తుకుంటే ఎంతో సంతోషంతో పొంగిపోయాను.

ఇక ఆ రోజు రాత్రి ఆ బంగారు బొంగరాన్ని నా జేబులోనే పెట్టుకుని పడుకున్నాను. ఎందుకో నన్నా బొంగరం అంతగా ఆకర్షించింది. ప్రొద్దున్నే ఆరింటికే మా ఇంటికి వచ్చాడు హయాత్‌బాష.

"నీ బొంగరాలన్నీ నీకిచ్చేస్తాను. ఇదిగో గోళీలు కూడా నువ్వే తీసుకో. నా బంగారు బొంగరం నాకిచ్చెయ్" అన్నాడు.

"కుదర్దు. మాటంటే మాటే" అన్నాన్నేను.

"అది కాదు మా బాబాయ్..." అంటూ నా బంగారు బొంగరాన్ని లాక్కోబోయాడు. నేను కొట్టాను. వాడూ కొట్టాడు. కలబడ్డాము. చివరి గెలుపు నాదే.

"రేయ్! నన్నే కొడతావా? మాట తప్పుతావా? పో! నీకు ఈ బంగారు బొంగరం ఇవ్వను. నా బొంగరాలూ యివ్వను. గోళీలు కూడా యివ్వను. ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో పో" అంటూ అన్నీ లాక్కొని వాణ్ణి తోసిపారేశాను. వాడు క్రింద పడ్డాడు. ఏడుస్తూ లేచాడు. "దొంగ సచ్చినోడా! ఉండు మా నాన్నను పిలుచుకుని వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు హయాత్‌బాష.

వాడు తప్పక వాళ్ళ నాన్నను పిలుచుకుని వస్తాడని, నేనూ ఎదురు చూస్తున్నాను. ఎందుకంటే నేను బాగా చదువుకుంటానని వాళ్ళ నాన్నకి నా మీద అభిమానం ఎక్కువ. నేనే అడిగితే ఆ బంగారు బొంగరం నాకే యిచ్చేస్తాడని నమ్మకం.

అయితే అతి గమ్మత్తుగా వాడు కానీ, వాళ్ళ నాన్న కానీ రాలేదు!

రంజాన్ దాటి పోయింది. మరుసటి రోజు స్కూలుకు కూడా హయాత్‌బాషా రాలేదు. ఏమైందబ్బా అనుకుంటూ యింటికి వచ్చాను. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో హయాత్‌బాషా వాళ్ళ నాన్న , తాత దగ్గరికి వచ్చి బిగ్గరగా విలపించాడు. "ఏమైంది బాషా! ఎందుకేడుస్తున్నావ్?" అని అడిగాడు మా తాత.

"సామీ! ఏం చెప్పను? మా హయాత్‌కు కలరా సోకి నిన్న రాత్రి హఠాత్తుగా చచ్చిపోయాడు. కల్లో కూడా అనుకోలేదు. చూసేలోగానే అంతా అయిపోయింది. నిన్న పొద్దుట్నుంచే వాడికి బాగాలేదు. చనిపోయే ముందర కూడా బాలు, బొంగరాలు, గోళీలు, నా బంగారు బొంగరం అనుకుంటూ చనిపోయాడు సామీ! రేపు అప్పుడే మూడో రోజు. మిమ్మల్ని చూసేసరికి దుఃఖం వచ్చింది. ఆపుకోలేకపోయాను. వస్తా సామీ!" అంటూ కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు నూర్‌బాషా.

"పాపం! ఎంత కష్టం వచ్చింది? మాయదారి కలరా ఎప్పుడొస్తుందో ఎవరికీ అర్థం కాకుండా వుంది. ఒరేయ్! బాలూ! జాగ్రత్తగా ఉండరా. బైట ఏమీ తినవద్దు" అంటూ తాత కూడా ఎక్కడికో బయలుదేరాడు.

నాకు దుఃఖం పెల్లుబికింది. మనస్సుకు చాలా కష్టం అనిపించింది. హయాత్‌బాష చచ్చిపోయాడన్న వార్తను వింటుంటేనే గుండె జారినట్లయింది.

పాపం వాడిని కొట్టాను. వాడి బొంగరం లాక్కున్నాను. ఇచ్చినవన్నీ తిరిగి తీసుకున్నాను. ఎంతో క్షోభపెట్టాను. చాలా తప్పు చేశాను. నేనిప్పుడేమి చేయాలి? బాగా ఆలోచించాను. ఒక నిశ్చయానికి వచ్చాను.

మరుసటి రోజు హయాత్‌బాషాను పూడ్చి పెట్టిన చోటుకు ఒంటరిగా వెళ్ళాను. మధ్యాహ్నం పన్నెండై ఉంటుంది. స్మశానమని కాని, దెయ్యాలు ఉంటాయని కాని నాకు భయం వేయలేదు. హయాత్‌బాష నా స్నేహితుడు. వాడు దెయ్యమై నన్ను పట్టుకుంటాడా? పట్టుకున్నా పీడించుకుతిన్నా పరవాలేదు. నాకు శాస్తి జరగాల్సిందే అనుకున్నాను తప్ప భయపడలేదు. వాడిని పూడ్చిపెట్టిన చోటనే మరో చిన్న గొయ్యి వుంది. అందులో వాడి బంగారు బొంగరం, నా బొంగరాలు, గోళీలు అన్నీ వేసేశాను. వాటితో పాటు నా కన్నీటి చుక్కలూ వేశాను. తరువాత మట్టితో పూడ్చేశాను. ఇంతలో వున్నట్లుండి వర్షం వచ్చింది.

నిశ్శబ్దంగా ఇంటికి వచ్చాను. వానలో తడిశానని సాకు చెప్పి మళ్ళీ స్నానం చేశాను. హయాత్‌బాషా గురించే ఆలోచించసాగాను. రాత్రంతా కలత నిద్ర. వాడి రూపమే కనిపిస్తోంది. తెల్లవారింది. హయాత్‌బాషా లేడు కాని ప్రపంచమంతా మామూలుగానే వుంది.

ఆదివారం కాబట్టి ప్రొద్దున్నే ఏడింటికే మిత్రులంతా వచ్చారు బొంగరాలు తీసుకుని. నేను వారితో అన్నాను -"ఇక మీదట నేను బొంగరాలు ఆడను. నాకు బొంగరం చూస్తే హయాత్‌బాష గుర్తుకు వస్తాడు. వాడి జ్ఞాపకార్థం నేను బొంగరాల జోలికిపోను. ఎందుకంటే నేను బొంగరాలు యిక మీదట పగులగొట్టలేను. హయాత్ బాషాలాగా బొంగరం కనిపిస్తుంటే ఇక ఎలా ఆడగలను?"

నా మాటలు అక్కడే వున్న మా తాతయ్య విన్నాడు. దుఃఖంతో వున్న నా దగ్గరగా వచ్చి లాలనగా నా తల మీద నిమిరాడు.

"మంచిది. స్నేహం ఎలా వుంటుందో నిన్ను చూశాక నాకు కూడా అర్థమైంది. నిజానికి ఈ బతుకే ఒక బొంగరం లాంటిది. ఎంత తిరిగినా ఏదో ఒకనాటికి శాంతించవలసిందే. నేల రాలవలసిందే. నీ ఫ్రెండ్ అదృష్టవంతుడు. త్వరగా ఆట ముగించుకున్నాడు. మరి నీ బొంగరం ఎంత దాకా తిరుగుతుందో అంతదాకా ఈ స్నేహం కూడా ఉండాలి. ప్రతి వారిలోనూ హయాత్‌బాషాను చూడడం నేర్చుకోవాలి" అని నొసటి మీద ముద్దుపెట్టాడు. ఆ ముద్దు తాలూకు వెచ్చదనం యిప్పటికీ నాకు కమ్మగా తగులుతూనే వుంది.

